ఉమ్మడి జిల్లా అంతటా ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక పూర్తయి ప్రొసీడింగ్స్ ఇచ్చి, ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజలు చేస్తుంటే మంత్రి కొండా సురేఖ ప్రాతినిధ్యం వహిస్తున్న వరంగల్ తూర్పు నియోజకవర్గంలో ఎదురుచూపులు తప్పడం లేదు. మంజూరు ప్రక్రియ ఇప్పటికే రెండు సార్లు వాయిదా పడడంతో ఇళ్ల కోసం ఎంతో ఆశగా దరఖాస్తు చేసుకున్న వేలాది మంది పేద ప్రజలకు నిరాశే మిగులుతోంది. అయితే మంత్రి సమయం ఇవ్వకపోవడం వల్లే ప్రొసీడింగ్స్ పంపిణీ ఆలస్యమవుతున్నదని తెలుస్తుండగా ఇంటి పనులు ప్రారంభించేందుకు శుభ ముహూర్తాలు ముగుస్తుండడంతో ఆశావహుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

- వరంగల్, జూన్ 10

మంత్రి వచ్చేదెప్పుడో ప్రొసీడింగ్స్ ఇచ్చేదెప్పుడో !

'తూర్పు'లో ఆశగా ఎదురుచూస్తున్న ఇందిరమ్మ లబ్ధిదారులు

- కొండా సురేఖ సమయం ఇవ్వకపోవడం వల్లే ఆలస్యం
- ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే అందజేసిన ఎమ్మెల్యేలు

వరంగల్ జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల కోసం సుమారు 20వేలకు మందికి పైగా దరఖాస్తులు చేసుకున్నారు. అందులో సుమారు 10 నుంచి 15వేల దరఖాస్తులు తూర్పు నియోజకవర్గం నుంచే వచ్చాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా లబ్ధిదారుల ఎంపిక, ప్రొసీడింగ్‌ల పంపిణీ వారం రోజుల క్రితమే ప్రారంభం కాగా మంత్రి ఇలాకాలో మాత్రం ఇప్పటివరకు వాటి ఊసేలేదు. జూన్ 2, 6వ తేదీల్లో పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తామని అధికారులు రెండు సార్లు తేదీలు ప్రకటించినా మంత్రి సురేఖ సమయం ఇవ్వకపోవడంతో వాయిదా పడింది. గ్రేటర్ పరిధిలోని వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట, పరకాల నియోజకవర్గాలకు సంబంధించిన ఎమ్మెల్యేలు తమ ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేయడమే కాకుండా ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజలు చేస్తున్నారు. తూర్పులో మాత్రం మంత్రి కొండా సురేఖ సమయం ఇవ్వకపోవడమే ప్రొసీడింగ్‌ల పంపిణీ ఆలస్యం అవుతున్నట్లు సమాచారం.

ఎదురుచూపులు ఎన్ని రోజులో..

తూర్పులో వచ్చిన దరఖాస్తుల నుంచి ఇందిరమ్మ కమిటీలు 4,200 మందిని అర్హులుగా గుర్తించారు. ఈ కమిటీలు పంపిన జాబితాను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి 3,100 మందిని అర్హులుగా ఫైనల్ చేశారు. అందులో 1,659 లబ్ధిదారుల ప్రొసీడింగ్‌లను సిద్ధం చేశారు. మిగతా అర్హులను గుర్తించి జాబితా పంపాలని అధికారులు కమిటీలకు సూచించారు. అయితే ఇప్పటి వరకు ఒక్క లబ్ధిదారుడికి మంజూరు పత్రాలు అందించలేదు. మంత్రి సమయం ఇచ్చిన వెంటనే ప్రొసీడింగ్స్ పంపిణీ చేస్తామని అధికారులు చెబుతుండగా.. మరి మంత్రి ఎప్పుడు సమయమిస్తారో వేచిచూడాలి.

హనుమకొండ జిల్లా కమలాపూర్‌లో పత్తిగింజలకు నీళ్లు పారిస్తున్న రైతు కెత్త వీరమల్లు

సీజన్‌కు ముందే మోస్తరు వర్షాలతో మురిపించిన వరుణుడు తీరా ముఖం చాటేయడంతో రైతన్న ఆందోళనలో పడ్డాడు. ఈసారి అదునుకు ముందే వర్షాలు పడుతాయనే ఆశతో నార్లు పోసి, దుక్కులు దున్ని, పత్తి గింజలు వేసుకున్నాడు. తీరా చినుకు జాడ కరువై పంటకు తడి లేక ఎండిపోతుండడం చూసి కన్నీళ్లు పెట్టుకుంటున్నాడు. విత్తుకున్న గింజలకు నీటి తడి కోసం నానా తంటాలు పడుతున్నాడు. ఇప్పటికే యాసంగి సీజన్‌లో వర్షాభావ పరిస్థితులు, కరువుతో 30 శాతం పంట దిగుబడి కోల్పోయిన రైతులు ఈ వానకాలంపైనే పూర్తి నమ్మకం పెట్టుకోగా సీజన్ ఆరంభంలోనే వర్షాలు దోబూచులాడుతుండడంతో పంటల సాగు ఎలా గని ఆవేదన చెందుతున్నారు.

- జనగామ, జూన్ 10(నమస్తే తెలంగాణ)

ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్



హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం వంగపహాడ్ శివారు గ్రామంలో ఎండిపోతున్న పత్తి మొలకలు

కమలాపూర్ మండలం అంబాల గ్రామంలో పత్తిగింజలు పెడుతున్న రైతులు

మురిపించి.. ముఖం చాటేసి

దినుకు జాడ కోసం ఎదురుచూపులు

- నేలకు తడి లేక రైతుల దిగాలు
- ఎండకు మాడిపోతున్న విత్తనాలు
- యాసంగిలో సాగుపై కరువు ప్రభావం
- ఈ సీజన్‌పై రైతుల ఆశలు

దాదాపు నెల రోజుల నుంచి సాగు పనులు మొదలయ్యాయి. దుక్కులు దున్ని పొలాలను సిద్ధం చేసుకున్న రైతులు నారు సిద్ధం చేసుకున్నారు. జనగామ జిల్లాలో వానకాలంలో వరి 2.15 లక్షలు, పత్తి 1.25 లక్షలు.. అన్ని పంటలు కలిపి 3.40 లక్షల ఎకరాల వరకు సాగు చేసే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. నర్మెట, పాలకుర్తి, లింగాలఘనపురం, దేవరుప్పుల, రఘునాథపల్లి, స్టేషన్‌ఘన్‌పూర్, జఫర్‌గఢ్, కొడకండ్ల, పాలకుర్తితో పాటు జనగామ ప్రాంతంలోని పలు గ్రామాల్లో సుమారు 40వేల ఎకరాలకు పైగా పత్తి గింజలు విత్తుకున్నారు. గత నెల 24వ తేదీ వరకు అడపాదడపా వర్షాలు కురవడంతో 10 నుంచి 15వేల ఎకరాల్లో వరి నాట్లు కూడా వేశారు. ప్రస్తుతం భూగర్భ జలాలు 10 మీటర్ల లోతుకు పడిపోగా, 80శాతం మేర బోర్లు వట్టిపోయాయి. బోరు బావుల ద్వారా సాగు నీరు అందించలేని పరిస్థితుల్లో రైతులు ఆధారపడ్డారు. గత నెల 25 నుంచి వాన జాడ లేకపోవడంతో నారు మళ్లు, నాట్లు వేసిన పొలాలు, పత్తి విత్తనాలు ఎండిపోయి పరిస్థితి వచ్చింది. దీంతో రైతులు పెట్టుబడులు నష్టపోయే అవకాశం ఉంది. రోహిణి కార్తె ముగిసి మృగశిర కార్తె మొదలైనప్పటికీ వరుణుడు ముఖం చాటేయడంతో సీజన్ పరిస్థితిపై రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉండగా కొందరు అప్పులు చేసి బోర్లను మళ్లీ వేయిస్తుండగా, మరి కొందరు కొత్తగా వేయిస్తున్నారు.

వంగపహాడ్‌లో పత్తిలో దుక్కి దున్నుతున్న రైతు బట్టిమేకల గట్టుమల్లు

బైరాన్‌పల్లిలో ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు

ముచ్చర్ల నాగారంలో నాటు వేయడానికి సిద్ధంగా ఉన్న నారుమడి

అంబాల రోడ్డు వద్ద బావి పూడికతీస్తున్న రైతు

నకిలీ విత్తనాలు, పురుగు మందులు విక్రయిస్తే

పీడీయాక్ట్ నమోదు చేస్తాం

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీ సన్‌ప్రీత్‌సింగ్

- ఫోన్ నంబర్ 7799848333కు సమాచారం ఇవ్వండి
- సీపీ సన్‌ప్రీత్‌సింగ్

నమస్తే ఎఫెక్ట్

సుబేదారి, జూన్ 10: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో రైతులకు ఎవరైనా నకిలీ విత్తనాలు, పురుగు మందులు విక్రయిస్తే వారిపై పీడీయాక్ట్ చట్టం అమలు చేస్తామని పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ హెచ్చరించారు. 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో ఈనెల 8న 'నకిలీ విత్తనాలపై నజర్ ఏది?.. నిందితులపై పీడీయాక్ట్‌లు పెట్టరా?' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి సీపీ స్పందించారు. మంగళవారం హనుమకొండలోని వరంగల్ కమిషనరేట్ కార్యాలయంలో 'నకిలీ విత్తనాలు, పురుగు మందులు విక్రయిస్తే 7799848333 ఫోన్ నంబర్‌కు సమాచారం ఇవ్వండి' అనే పోస్టర్‌ను సీపీ ఆవిష్కరించి మాట్లాడారు. వర్షకాల సీజన్ ప్రారంభమవుతున్న సందర్భంగా ఎవరైనా నకిలీ విత్తనాలు, పురుగు మందులు విక్రయిస్తే పీడీయాక్ట్ నమోదు చేస్తామని, సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఇప్పటి వరకు కమిషనరేట్ పరిధిలో రూ.1.23కోట్ల విలువైన నకిలీ విత్తనాలు, పురుగు మందులు, స్వాధీనం చేసుకున్నామని, 14 మంది నిందితులను అరెస్ట్ చేశామని సీపీ పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ రవి, ఏసీపీలు జితేందర్ రెడ్డి, డేవిడ్ రాజ్, ఇన్‌స్పెక్టర్ విశ్వేశ్వర్ పాల్గొన్నారు.

జల్సాల కోసం సొంత ఇంటికే కన్నం

- అప్పులు తీర్చేందుకు బంగారం చోరీ
- 24 గంటల్లో నిందితుడిని పట్టుకున్న పోలీసులు

వివరాలు వెల్లడిస్తున్న వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్

కరీమబాద్, జూన్ 10: ఇంటి దొంగను ఈశ్వరుడైనా పట్టుకోలేడనే సామెత నిజమవుతుందనుకున్నాడే ఏమో.. జల్సాలకు అలవాటు పడి.. బిజినెస్‌కు దోస్తుల దగ్గర చేసిన అప్పులు తీర్చడం కోసం తన ఇంటిలోనే దొంగతనం చేశాడో యువకుడు.. ఇంటి యజమాని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టిన పోలీసులకు అసలు నిజం తెలిసింది. కన్న కొడుకే చోరీ చేశాడనే విషయం తెలియడంతో ఆ తండ్రి ఆవేదన చెందాడు. ఈ మేరకు ఖిలా వరంగల్ పడమర కోటలో రెండు రోజుల క్రితం జరిగిన దొంగతనం వివరాలను మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో వరంగల్ ఏసీపీ నందిరాం వెల్లడించారు. పడమరకోటకు చెందిన గుర్రపు రామకృష్ణ కొడుకు జయంత్ హైదరాబాద్‌లో బీబీసీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. ఈ నెల 8న రామకృష్ణ భార్య, కూతురుతో కలిసి హైదరాబాద్‌లోని బంధువుల ఫంక్షన్‌కు వెళ్లారు. అదే రోజు రాత్రి రాగా ఇంట్లోని సామాన్లు చిందరవందరగా పడి ఉన్నట్లు గమనించి, లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని బంగారు నగలు అపహరణకు గురైనట్లు గుర్తించి మిల్స్‌కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ఈ నెల 10న ఫోర్టు రోడ్డు జంక్షన్‌లో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా గుర్రపు జయంత్ పారిపోయే ప్రయత్నం చేశాడు. దీంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా చోరీ చేసినట్లు అంగీకరించాడు. జయంత్ గర్ల్ ఫ్రెండ్‌తో జల్సాలు చేసేందుకు డబ్బుల అవసరం పడ్డాయి. దీంతో పాటు హైదరాబాద్‌లో ఫుడ్ కోర్టు పెట్టి వ్యాపారంలో నష్టపోవడంతో మిత్రుల దగ్గర అప్పులు చేశాడు. జల్సాలు, అప్పులు తీర్చడం కోసం ఇంట్లో ఎవరూ లేని సమయంలో నిందితుడు బంగారం దొంగతనం చేశాడు. దాన్ని అమ్మి అప్పులు తీర్చుదామని అనుకున్నాడు. బంగారం కరిగించి అమ్మేందుకు వెళ్తున్న క్రమంలో పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన సీఐ బొల్లం రమేశ్, ఎస్సైలు శ్రీకాంత్, సురేశ్, సిబ్బంది ప్రవీణ్‌రెడ్డి, వాజిద్, నరేందర్, రఫీలను ఏసీపీ అభినందించారు. నిందితుడి నుంచి 11.16 గ్రాముల బంగారం, ఒక ద్విచక్ర వాహనం, మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కరెంట్ అధికారిపై కాంగ్రెస్ నేత దాడి

శాయంపేటలో పీఎస్‌లో కేసు నమోదు

సుబేదారి, జూన్ 10 : హనుమకొండ జిల్లా శాయంపేట మండలం నేరేడుపల్లి గ్రామంలో విద్యుత్ విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఏఈ పవన్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది గ్రామంలో కాంగ్రెస్ నాయకుడు ఆకుతోట సమ్మిరెడ్డి ఇంట్లో విద్యుత్ చౌర్యంపై పరిశీలించారు. దీంతో కుటుంబ సభ్యులు సమ్మిరెడ్డికి సమాచారం ఇవ్వడంతో ఆయన వచ్చి విజిలెన్స్ ఏఈ పవన్‌కుమార్‌పై దాడికి దిగినట్లు చెప్పారు. దీంతో విజిలెన్స్ ఏఈ పవన్‌కుమార్ శాయంపేట పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి, తనపై సమ్మిరెడ్డి దాడి చేసి, విధులకు ఆటంకం కలిగించారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమ్మిరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పరమేశ్ తెలిపారు. ఇదిలా ఉండగా, విద్యుత్ విజిలెన్స్ అధికారులు సమాచారం లేకుండా తమ ఇంట్లో అక్రమంగా చొరబడి మహిళలను ఇబ్బందులకు గురిచేశారని సమ్మిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆరుగురు ఇన్‌స్పెక్టర్ల బదిలీ

సుబేదారి, జూన్ 10 : వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఆరుగురు ఇన్‌స్పెక్టర్లు బదిలీ అయ్యారు. ఈ మేరకు మంగళవారం కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ ఉత్తర్వులు జారీచేశారు. టాస్క్‌ఫోర్స్ విభాగంలో పనిచేస్తున్న ఎం రంజిత్ సుబేదారికి బదిలీ కాగా, ఇక్కడ పనిచేస్తున్న పీ సత్యనారాయణ టాస్క్‌ఫోర్స్‌కు బదిలీ అయ్యారు. క్రైం విభాగంలో పనిచేస్తున్న ఎం శివకుమార్ హనుమకొండకు బదిలీ కాగా, ఇక్కడ పనిచేస్తున్న వై సతీశ్ స్పెషల్ బ్రాంచ్‌కి బదిలీ అయ్యారు. స్పెషల్ బ్రాంచ్ విభాగంలో పనిచేస్తున్న జే సురేశ్ ఎనుమాములకు బదిలీ కాగా, ఇక్కడ పనిచేస్తున్న ఏ రాఘవేందర్ క్రైం విభాగానికి బదిలీ అయ్యారు. కాగా, ఇటీవల మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన బొల్లం రమేశ్, కాజీపేట ఎస్సైగా పనిచేసి ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగోన్నతి పొందిన శివకృష్ణ మర్యాదపూర్వకంగా సీపీ సన్‌ప్రీత్‌సింగ్‌ను కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు.

మాను కోట రవాణా శాఖలో పైసలిస్తేనే ఫైల్ కదులుతది.. లేదంటే అది లేదు ఇదిలే దంటూ అనేక కొర్రీలు పెడుతూ చెప్పలరిగేలా తిప్పిస్తారు. అధికారులు, సిబ్బంది మామూళ్లకు అలవాటు పడి వాహనదారులను ముప్పతిప్పలు పెడుతున్నారు. డ్రైవింగ్ లైసెన్స్, రెన్యువల్, వాహనాల రిజిస్ట్రేషన్లు, తదితర పనుల కోసం వచ్చే వారి పత్రాలపై ఏజెంట్ల కోడ్ ఉంటేనే అవి పాస్ అవుతాయి. లేదంటే వాటిని పక్కకు పడేస్తారు. గతంలో ఇదే శాఖలో ఓ ఎంవీఐ ఏసీబీకి పట్టుబడినా అధికారుల తీరు మారడం లేదు. అవినీతి నిరోధక శాఖ అధికారులు ఈ శాఖ వైపు ఓ కన్నేసి ఉంచాలని వాహనదారులు కోరుతున్నారు.

- మహబూబాబాద్, జూన్ 10 (నమస్తే తెలంగాణ)

పైసలిస్తేనే.. ఫైల్ కదిలేది

రవాణా శాఖలో అధికారులు, సిబ్బంది వసూళ్ల పర్వం

- పత్రాలపై ఏజెంట్ల కోడ్ ఉంటేనే పాస్
- ఏసీబీకి పట్టుబడినా మారని తీరు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు

ఇటీవల గూడూరు మండలానికి చెందిన ఓ విద్యార్థి 2 వీలర్ రిజిస్ట్రేషన్ కోసం ఏజెంట్లను సంప్రదించకుండా నేరుగా వెళ్లాడు. ఆ ఫైల్ మీద ఏజెంట్ కోడ్ భాష లేకపోవడంతో మధ్యాహ్నం 3 గంటలు దాటినా రిజిస్ట్రేషన్ చేయలేదు. దీంతో అక్కడున్న సిబ్బందితో గొడవకు దిగాడు. అనంతరం సంబంధిత శాఖ అధికారి వద్దకు వెళ్లి ప్రశ్నించగా 'నీకు హెల్మెట్ ఉంది కానీ ఫైల్‌లో దానికి సంబంధించిన బిల్లు లేదు' అని చెప్పాడు. షో రూమ్ నిర్వాహకుడు ఇవ్వలేదని చెప్పినా వినిపించుకోలేదు. చేసేదేమీ లేక అడిగినంత ఇచ్చుకొని తన పని పూర్తి చేసుకున్నాడు.

మానుకోట రవాణా శాఖలో ప్రతి ఫైలుకు పైసలివ్వనిదే ముందుకు కదలడం లేదు. నిత్యం లెర్నింగ్, శాశ్వత లైసెన్స్, రెన్యువల్, వాహనాల రిజిస్ట్రేషన్లు, తదితర పనుల కోసం వందలాది మంది వస్తుంటారు. వాహనదారుల వీక్‌నెస్‌ను ఆసరాగా చేసుకొని కొంతమంది అధికారులు, సిబ్బంది వసూళ్ల పర్వానికి తెర లేపారు. ఏ శాఖలోనైనా కిందిస్థాయి సిబ్బంది తప్పు చేస్తే అధికారులకు ఫిర్యాదు చేస్తారు. ఇక అధికారులే తప్పు చేస్తే వాహనదారులు ఎవరికి చెప్పాలో తెలియక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. లెర్నింగ్ లైసెన్స్ కోసం స్లాట్‌లో బుక్ చేసుకుని ఆఫీస్‌కు వెళ్లిన దగ్గర నుంచి పూర్తయ్యే వరకు పెద్ద తతంగం నడుస్తుంది. కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న వారు, లేని వారిని సైతం ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. శాశ్వత డ్రైవింగ్ లైసెన్స్ కోసం వచ్చేవారు కూడా డబ్బులు ఇవ్వనిది టెస్ట్ పాస్ చేయడం లేదు. బైక్‌లతో పాటు ఆటోలు, కార్లు, లారీలు, ట్రాక్టర్లు, ఇలా కొత్తగా కొనుగోలు చేసిన రకరకాల వాహనాల రిజిస్ట్రేషన్ కోసం రవాణా శాఖకు రాక తప్పదు. ఏజెంట్ల ద్వారా పోయిన వారికే రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. ఏజెంట్లు ఫైల్ మీద తమ కోడ్ భాష వేస్తారు. అది ఉంటేనే పాస్ చేస్తారు. లేదంటే అనేక కొర్రీలు పెడుతూ రిజిస్ట్రేషన్ చేయకుండా ఆపుతున్నారు.

నెల్లికుదురు మండలంలో..

నెల్లికుదురు మండలంలోని ఓ వ్యక్తి టూ వీలర్ అండ్ ఫోర్ వీలర్ శాశ్వత డ్రైవింగ్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. అతడి వద్ద కారు లేకపోవడంతో అక్కడున్న వ్యక్తి వాహనం నడిపి చూపించాలని అధికారి చెప్పాడు. అనంతరం ఆ కారు వ్యక్తికి రూ. 500 చెల్లించాలని ఆదేశించాడు. ఎందుకివ్వాలని నిలదీసినా వినకపోవడంతో తన వద్ద ఉన్న రూ. 300 చెల్లించి వెళ్లిపోయాడు. ఇలా ఒకటి కాదు రెండు కాదు నిత్యం 200 నుంచి 300 మంది రవాణా శాఖకు వస్తుంటారు. వీరి వద్ద నుంచి అధికారులు, సిబ్బంది కుమ్మక్కై ముక్కుపిండి డబ్బులు వసూలు చేస్తున్నారు.

ఊరించి.. ఉసూరుమనిపించి

ఆర్‌వైవీని నిలిపి వేసిన కాంగ్రెస్ సర్కారు

- యువత ఆశలు ఆవిరి
- రుణ మంజూరు నిలిపివేయాలని ఆదేశాలు
- రాజీవ్ యువ వికాసం ప్రక్రియను పక్కన పెట్టిన అధికారులు
- గ్రేటర్ 33,027 మంది ఆశల గల్లంతు

8లో